ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 169 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




### జర్నలిస్టుల అక్రిడేషన్
## 3 నెలలు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీతో అక్రిడేషన్ కార్డుల గడువు ముగియనుంది. తదితర కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐ అండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

### అధికారుల తప్పిదానికి
# సాక్ష్యం కాళేశ్వరం



### నాణ్యత విషయంలో రాజీపడరాదు
### 700 మంది ఎఇఇలకు నియామక పత్రాలు
### ఐదేళ్లకే కుప్పకూలడంతో కోట్లు వృధా
### గత ప్రభుత్వ నిర్వాకంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దని అన్నారు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవు. నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది

..మిగతా 2లో



## ఫార్మా సిటీ రద్దు వెనుక
# వేల కోట్ల కుంభకోణం

### ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ దందాకు పాల్పడతే సహించం
### రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇచ్చేయండి
### అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తప్పవు
### మీడియా సమావేశంలో కెటిఆర్ హెచ్చరిక

రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అని కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూటచర్ సిటీ పేరుతో రియల్ దందాకు సిఎం రేంవత్ తెరలేపారని అన్నారు. ఫార్మా సిటీని రద్దు చేస్తేఆ భూములను తిరిగి రెతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ చాలా స్పష్టంగా ఎన్నికలకు ముందు చెప్పింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతో పాటు ఇతర వేదికల ద్వారా రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. చాలా మంది నాయకులు స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఫార్మా సిటీ రద్దు అని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనలు చేశారు. అయితే ఫార్మా సిటీ ఉన్నదా..? పోయిందా..? అని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ రద్దు కాలేదు.. అట్లనే ఉందని నిన్న హైకోర్టులో పిటిషన్ వేసింది. నేను ఈ ప్రభుత్వాన్ని ఒక్కటే సూటిగా అడుగుతున్నా.. సీఎం ఎక్కడ మాట్లాడినా ఉన్న సిటీ గురించి మాట్లాడడం లేదు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ అని మాట్లాడుతున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పు చేతన్కతే.. నీ భాషలో చెప్పాలంటే మొగోడివి అయితే చెప్పు.. నీవు చెప్పే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ కోసం ఒక్క ఎకరమైనా భూసేకరణ చట్టం కింద సేకరించావా..? మీరు ఒక్క ఎకరం భూమి సేకరించకపోతే, మేం గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ భూమే అయితే దాన్ని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తావు..? చివరకు న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నావు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. నువ్వు గతంలో చెప్పిన మాట ప్రకారం.. ఫార్మా సిటీని రద్దు చేసిన మాట నిజమే అయితే.. ఆ భూములను రైతులకు తిరిగిచ్చే పని చేయ్. అలా కాకుండా ఫోర్త్ సిటీ కడుతా.. ఫిఫ్త్ సిటీ కడుతా.. మా ఫోర్ బ్రదర్స్‌కు

..మిగతా 2లో

# 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు

### సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొ÷ల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొ÷ల్స్‌ను డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందు పరుస్తారు‘అని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని కోరారు.





### శ్రీవారి భక్తులకు
# ముఖ్య గమనిక
### బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల

తిరుమల, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన నేల తిరుమలలో బ్రహ్మోత్సవాల షెడ్యూల్ విడుదల అయింది. టీటీడీ గురువారం ఈ షెడ్యూల్‌ను రిలీజ్ చేసింది. అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తుంది. అక్టోబర్ 4న ధ్వజారోహణం, అక్టోబర్ 8న గరుడసేవ, అక్టోబర్ 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, అక్టోబర్ 12న చక్రస్నానం నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**రాకపోకలపై నిషేధం..**

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొండపైకి వచ్చే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. అక్టోబర్ 7 రాత్రి 11 గంటల నుంచి అక్టోబర్ 8 అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం విధిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ.. ప్రత్యేక దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయనుంది.

# విద్యుత్ శాఖలో ఆర్టిజన్ల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలి

### దీర్ఘకాల తమ సమస్యను పరిష్కరించాలని భారీ సంఖ్యలో తరలివచ్చిన ఆర్టిజన్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం): దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన విద్యుత్ శాఖలో పనిచేసే ఆర్టిజన్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే కంప్లీట్ చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణ డిస్కం హెడ్ క్వార్టర్ ముందు భారీ స్థాయిలో ఆ కార్మికుల జేఏసీ ఆందోళన నిర్వహించింది. ఆర్టిజన్ల కన్వర్షన్ ప్రక్రియను ముగించాలని, అర్హులైన వారిని క్రమబద్ధీకరించాలని, ఆ తర్వాతనే మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు జిల్లాల నుంచి వేలాది మంది పాల్గొన్న ఈ ధర్నాతో మింట్ కాంపౌండ్ ప్రాంతం దిగ్బంధమైంది. నినాదాలతో సచివాలయ పరిసర ప్రాంతమంతా మార్మోగింది. జూనియర్ లైన్మెన్, జూనియర్ అసిస్టెంట్, సబార్డినేట్ పోస్టుల్నీ భర్తీ చేయడానికి ముందే ఆర్టిజన్ల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికుల విద్యార్హతలకు అనుగుణంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి రెగ్యులరైజేషన్, పదోన్నతుల కోసం ప్రక్రియను ప్రారంభించాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని దక్షిణ డిస్కం యాజమాన్యాన్ని హెచ్చరించారు.



విద్యుత్ మింట్ కాంపౌండ్ ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆర్టిజన్లు



### కాంగ్రెస్ తుఫాన్‌లో బిజెపి
## కొట్టుకుపోవడం ఖాయం
### హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్

2




### దేశీయంగా మూడు
## సూపర్ కంప్యూటర్ల అభివృద్ధి
### పరమ్ రుద్ర కంప్యూటర్లను ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. శాస్త్రీయ పరిశోధనల కోసం రూ.130 కోట్లతో పుణె, దిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన ’పరమ్ రుద్ర’ సూపర్ కంప్యూటర్లను నుంచి ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. వాతావరణ పరిశోధనల కోసం రూ.850 కోట్లతో రూపొందించిన హై-పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను సైతం ప్రధాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజును శాస్త్ర, సాంకేతిక రంగంలో చాలా గొప్ప విజయాలు సాధించిన రోజుగా పేర్కొన్నారు. సాంకేతిక

..మిగతా 2లో

# ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం

మొదటి పేజీ తరువాయి...

రియల్ ఎస్టేట్ దందాకు వాడుతా అంటే రైతులు ఊరుకోరు. ఏ రైతుల్కెతే నీకు ఓటేశారు.. వారే నీ పార్టీ అంతు చూస్తారు. రేపు ప్రభుత్వం కోర్టులో స్పష్టంగా చెప్పాలి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఫార్మా సిటీ కడుతున్నారా..? లేదా..? అదే విధంగా కోర్టు కూడా నోటీసు చేయాలని న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఫార్మా సిటీ కోసం ఏడేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి, మెప్పించి.. నానా తంటాలు పడి సేకరించిన 14 వేల ఎకరాల్లో 64 వేల కోట్ల పెట్టుబడులు రావాలని లక్షలాది మంది ఉద్యోగ ఉపాధి అకాశాలు రావాలని ఫార్మాసిటీని ప్రతిపాదించామని కేటీఆర్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం ఆనాడు సేకరించిన 14 వేల ఎకరాలు కండిషనల్ ల్యాండ్ అక్విజిషన్ కింద తీసుకున్నాము. అంటే ఫార్మా సిటీ కోసమే మేము తీసుకుంటున్నాము అని స్పష్టంగా జీవోలో పేర్కుంటూ ఫార్మా సిటీ కోసం భూములను తీసుకున్నాం. ఇవాళ ఆ భూములను రియల్ ఎస్టేట్ దందా కోసం, ఫ్యూచర్ సిటీ అనే డ్రామాల కోసం, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం, ఏఐ సిటీ అనే హడావుడి కోసం మళ్లించి దాంట్లో నుండి వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పక్కా రియల్ ఎస్టేట్ స్కాం.. దీన్ని న్యాయమూర్తులు గమనించాలని కోరుతున్నాను. భూ దందాలను తప్పకుండా బయటపెడుతాం. ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వాన్ని అడుగుతున్నా.. ఫార్మా సిటీని కొనసాగిస్తే 14 వేల ఎకరాల్లో ఉండాలి లేదా రద్దు చేస్తే ఆ భూమి రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు అహంకారంతో



అడ్డగోలుగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులకు శిక్ష తప్పదు.. రిటైర్ అయినా రికవరీ చేయించే బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా, కార్యకర్తల మాదిరి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న చిన్న పల్లెలను గ్రామపంచాయతీలుగా మార్చి 54 కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ఆ రేషన్ దుకాణాలను స్థానికంగా ఉండే పొదుపు సంఘాలకు అప్పజెప్పాం. తద్వారా వారికి కొంత ఆదాయం వస్తదని అప్పజెప్పాం. మరి నువ్వేం చేశావు. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుడు తానే రాజు, తానే మంత్రి అన్నట్టు.. నేనే ప్రభుత్వాన్ని నడుపుతున్న అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అధికారులు వంతపాడుతూ ఆగమాగం అవుతున్నారు. మొన్న ఏపీలో ఏం జరిగిందో చూడండి.. ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు కూడా సస్పెండ్ అయ్యారు. చట్టం ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్టు చేస్తాం అంటే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. ఆలిండియా సర్వీసు ఆఫీసర్లు, పోలీసులు, ఆర్డీవోలు, కలెక్టర్లు ఎవరైనా ఫలితం అనుభవిస్తారు. చట్టం ప్రకారం, ఒళ్లు దగ్గర పెట్టుకోని పని చేయండి. ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ఊరుకోం. మరో నాలుగేండ్లలో మళ్లీ కేసీఆర్ తిరిగి వస్తరు.. విరీ సంగతి తప్పకుండా చూస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. కలెక్టర్, ఆర్డీవోను అడుగుతున్నా.. 54 రేషన్ దుకాణాలకు 480 మంది దరఖాస్తు చేసుకున్నారు. పారదర్శకత పాటించకుండా లక్షల రూపాయాలకు ఆ పోస్టులను అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులే ప్రెస్‌విరీట్లు పెట్టి ఆరోపిస్తున్నారు. అర్హత ఉన్న బాధితులేమో వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌ను, స్థానిక మంత్రులను ఈ విషయంలో సూటిగా అడుగుతున్నా.. రాతపరీక్ష పెట్టామని అంటున్నారు కదా.. మెరిట్ లిస్ట్ బయటపెట్టండి.. వెంటనే జాబితా ప్రకటించండి. పీజీలు, డిగ్రీలు చదువుకున్నోళ్లకు మార్కులు రావట. పదో తరగతి పాసైన వారికి మార్కులు వస్తాయట.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటే, లక్షలు సమర్పించుకుంటే మార్కులు వస్తాయట. ఇంత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తారా..? లక్షల రూపాయాలకు పోస్టులను అమ్ముకుంటారా..? మళ్లీ మా టైం వస్తది.. తప్పకుండా అధికారులకు శిక్ష పడుతది. రిటైర్ అయినా రికవరీ చేయిస్తాం.. అతి చేసే వారికి మిత్తితో సహా చెల్లిస్తాం. రేషన్ దుకాణాల బాధితుల తరపున హైకోర్టును ఆశ్రయిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.




## దేశీయంగా మూడు సూపర్ కంప్యూటర్ల అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

విప్లవ యుగంలో కంప్యూటింగ్ సామర్థ్యం జాతీయ సామర్థ్యానికి ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. సాంకేతిక, కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడని రంగమంటూ ఏదీ లేదని తెలిపారు. ఈ సాంకేతిక విప్లవంలో మన వాటా బిట్స్, బైట్స్‌లో కాదు.. టెరా బైట్లు, పెటా బైట్లలో ఉండాలన్నారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సొంతంగా సెవిరీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను నిర్మించడంతో పాటు ప్రపంచంలోని సరఫరా గొలుసులో కీలకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ప్రాముఖ్యత కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదన్న ప్రధాని.. దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను సైతం నెరవేర్చేలా ఉండాలన్నారు.



## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలి

### నో సీపీఎస్.....నో యూపిఎస్....ఓన్లీ ఓపియస్

గద్వాల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం , తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోని పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని సీపీయస్ యూనియన్ గద్వాల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలియజేయడం జరిగింది.మల్దకల్ మండలంలోని అమరవాయి స్కూల్ కాంప్లెక్స్ లోను ,గద్వాల్ మండలం అనంతపురం హైస్కుల్లో భోజన విరామ సమయంలో మరియు జిల్లాలోని అన్ని మండలాల్లో ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన UPS/NPS విధానంను వ్యతిరేకిస్తూ

CPS వద్దు...NPS వద్దు...UPS వద్దు...

పాత పెన్షన్ విధానమే ముద్దు అంటూ స్లొగన్స్ ఇస్తూ

సెప్టెంబర్ 26, పెన్షన్ ఆక్రోష్ మార్చ్ కార్యక్రమం ను

నిర్వహించడం జరిగింది. పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.

జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లడుతూ ... సోమనాథన్ కమిటీ ఆధారంగా యూపీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం , ఆ నివేదికను ఇవ్వాలని ఆర్టిఐ ద్వారా కోరితే కేంద్ర ఆర్థిక శాఖ నివేదికను బహిరంగపరచలేం అని తెలిపింది.తద్వారా ప్రభుత్వ ఉద్యోగుల భద్రత మరియు భవితవ్యం పై కేంద్ర ప్రభుత్వం యొక్క పెన్షన్ వ్యతిరేక వైఖరి ఏంటో అర్థం అయింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టో లో చెప్పిన విధంగ సీపీఎస్ విధానము రద్దు చేసి తక్షణమే పాత పెన్షన్ ను అమలు చేయాలని నాయకులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ హెడ్మస్టర్ నరేష్ ,ఎస్టీయు జిల్లా అధ్యక్షా ప్రధాన కార్యదర్శులు యూనస్ పాషా, పులిపాటి లక్ష్మన్ , పిఆర్టీయు ఆంజనేయులు , సీపీఎస్ జిల్లా కార్యదర్శులు అంజి, రాఘవేంద్ర, పుట్ట నాగరాజు, మురళీధర్ రెడ్డి, శాంతన్న, మల్లేష్, నల్లన్న, సీతం నాయుడు, రాఘవులు , సుందర రాజు, సఫాయి రవి, శ్రీకాంత్, రవి శంకర్, యాదేశ్వరి దేవి, లక్ష్మి దేవి ,తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఘటనా పోరాటానికి స్ఫూర్తి చిట్యాల ఐలమ్మ

### కాంగ్రెస్ నాయకులు జాంపల్లి వెంకటేశ్వర రెడ్డి



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం)అణచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ఆత్మగౌరవ ప్రతిక అని నాయకులు జాంపల్లి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం ధరూర్ మండలం ఉప్పేరు గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, నల్లారెడ్డి, ప్రతాప్ రెడ్డి, హన్మంతు రెడ్డి, పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాట యోధ, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా వారందించిన పోరాట స్ఫూర్తిని స్మరించుకుందామని అన్నారు. బలహీన వర్గాలు, నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయడమే ఐలమ్మకు మనమర్పించే ఘన నివాళి అని అన్నారు.



## చాకలి ఐలమ్మకు సీఎం ఘన నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెకు రాష్ట్రం యావత్తూ ఘనంగా నివాళి అర్పించింది. పార్టీలకు అతీతంగా పలువురు ఆమెను స్మరించుకున్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆమె చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు.

## అధికారుల తప్పిదానికి సాక్ష్యం కాళేశ్వరం

మొదటి పేజీ తరువాయి...

కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే అని సీఎం అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్లు కీలకమైన అంశమని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నీళ్లు మన జీవన విధానంలో ఓ భాగమని.. వ్యవసాయం, నీళ్లు తెలంగాణ ప్రజల భావోద్వేగమని అన్నారు. ఏఈఈలకు ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగమని వ్యాఖ్యానించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే మంచి అవగాహన వస్తోందని.. క్షేత్ర స్థాయిలో తిరిగి నిర్ణయాలు తీసుకుంటే తప్పులు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని సూచించారు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని.. నాణ్యత లేకుంటే నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఈ రోజు వరకు నిలబడ్డాయని అన్నారు.. ఐదేళ్ల ముందు మన కండ్లముందే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మాత్రం కూలిపోయిందని బీఆర్ఎస్‌పై ÷ర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పిన మ్యాన్ మేడ్ వండర్ ప్రాజెక్ట్ కూలిపోయిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనా వ్యయం ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. తప్పులు చేయకుండా ఉండేందుకు కొత్తగా ఎన్నికైన వాళ్లకు కాళేశ్వరం ఓ ప్రయోగశాలగా అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో చర్యలు తీసుకుంటే అసలు ఇరిగేషన్ డిపార్ట్ మెంటే ఉండదని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు సాగునీటిపై ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు.



## అవినీతి, అక్రమాలకు కేరాఫ్ బిఆర్ఎస్

### పార్టీలను విలీనం చేసుకున్న ఘనత వారిదే.. ఇప్పుడు నీతి వాక్యాలు వల్లించడం విడ్డూరం

### ఉప ఎన్నికలు రావు..వచ్చినా మేం సిద్ధం.. మాజీమంత్రి కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు

జనగామ, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): తెలంగాణలో అవినీతి, అక్రమాలకు మారుపేరు బీఆర్ఎస్ అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటుగా విమర్శించారు. వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే జిల్లాను ఆరు ముక్కలు చేశారని చెప్పారు. జిల్లాను ముక్కలు చేయొద్దని అన్నందుకే రెండోసారి తనకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆరోపించారు. స్టేషన్ ఘనపూర్‌లోగురువారం మాజీమంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వమే కాలరాసిందన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని విమర్శించారు. గతంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్ఎస్ నేతలే ఇప్పుడు కోర్టుకు వెళ్లడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. శాసనసభా పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అన్నారు. తెలంగాణ ఉపఎన్నికలు రావని.. ఒకవేళ వచ్చినా కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని వెల్లడిరచారు. కోర్టులు, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందని వెల్లడిరచారు. ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేషన్‌ఘనపూర్‌కు ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని అన్నారు. ఏకంగా శాసనసభ పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో ఉప ఎన్నిక రావని... వచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికలు వస్తే... బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. కోర్టులపై, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందన్నారు. వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే ఉమ్మడి జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలు చేశారని.. ఇది అడిగినందుకే తనకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని కడియం శ్రీహరి విమర్శలు గుప్పించారు. కాగా... రాష్ట్రంలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలక అసెంబ్లీ స్థానం స్టేషన్‌ఘనపూర్‌కు త్వరలో ఉపఎన్నిక వస్తుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికల్లో తాటికొండ రాజయ్య విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి పోటీచేసి విజయం సాధించారు. కానీ 2024 పార్లమెంట్ ఎన్నికల సమయానికి కడియం పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడియంతో పాటు పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కడియం వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.




## కాంగ్రెస్ తుఫాన్‌లో బిజెపి కొట్టుకుపోవడం ఖాయం

### హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్

ఛండీగఢ్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం):దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు. హరియాణాలో భాజపా కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తుపాను రాబోతోంది. అందులో భాజపా కొట్టుకుపోవడం పక్కా. రాష్టాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు. ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ అన్నారు.

## అమృత్ టెండర్లలో అవినీతి ఆరోపణలు

### బిఆర్ఎస్ నేత కెటిఆర్‌కు లీగల్ నోటీసులు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం): అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు లీగల్ నోటీసులు అందాయి. తెలంగాణ ప్రభుత్వం శోధ కంపెనీకి ఇచ్చిన అమృత్ పథకం టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై సుజన్ రెడ్డి ఈ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీకి నోటీసులు అందించారు. తప్పుడు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సృజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా గత కొంత కాలంగా.. తెలంగాణ ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ వెంటనే విచారణ చేపట్టి.. నిజాలను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి అధీనంలో ఉన్న పురపాలక శాఖ ద్వారా కేంద్రం అమలు చేస్తున్న అమృత్ టెండర్ల విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని బంధువులకు మోసపూరితంగా వందల కోట్ల కాంట్రాక్టులు దక్కేలా చేశారనేది ఆయన ప్రధాన ఆరోపణ. రేవంత్ కుటుంబానికి సంబంధించి అర్హత లేని కంపెనీలకు కాంట్రాక్టులు కేటాయించారని కేటీఆర్ అన్నారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8 వేల 888 కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారన్నారు. కేటీఆర్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేతలతో పాటు, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఖండిరచారు. ఈ అంశంపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, సృజన్... రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కాదని, తనకు అల్లుడని చెప్పారు. సృజన్‌కు రాజకీయాలతో సంబంధం లేదని వివరించారు.

# తమకు అన్యాయం చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్వనాశనం అయిపోతాడు




ఈ ఇల్లు మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో ఉందని ముద్ర వేసిన రెవెన్యూ అధికారులు



ముద్ర వేస్తున్న అధికారులు




అత్తాపూర్‌లో బండల దుకాణం షెడ్డు కు ముద్ర వేయడానికి వచ్చిన అధికారులు

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం): మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న ఇండ్లకు ఇవి మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న ఇండ్లు అంటూ రెవెన్యూ అధికారులు బుధవారం ముద్ర లు వేస్తుండగా బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అత్తాపూర్ భరత్ నగర్ కు చెందిన సునీత రావు తాము ఏడు సంవత్సరాలుగా ఇల్లు కట్టుకొని భరత్ నగర్ లో నివసిస్తున్నామని, తమకు ఇంటి నెంబర్, కరెంట్ బిల్లు, నల్ల కనెక్షన్ అన్నీ ఉన్నాయని ఇవన్నీ ఉండగా ఇప్పుడెలా కూలుస్తారు... అంటూ ప్రశ్నించారు . తమ ఇళ్లను కూల్చేముందు అధికారులను ప్రశ్నించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రూ. 50 లక్షలు పెట్టి ఇల్లు నిర్మించుకుంటే ఇప్పుడొచ్చి ఆ ఇల్లు మూసీ లో ఉంది కూలుస్తాం మీకు డబుల్ బెడ్డం ఇస్తాం అంటే ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తమకు అన్యాయం చేస్తే ముఖ్యమంత్రి సర్వనాశనం అయిపోతాడని, ఆయన పదవి ఊడుతుందని శాపనర్థాలు పెట్టారు. మూసీని ఎవరు అభివృద్ధి చేయాలని అడుగుతున్నారని మహిళలు ప్రశ్నించారు. రోడ్లు బాగు చేయాలి కానీ మూసీని అభివృద్ధి చేస్తానని పేదల ఇండ్లు కూలుస్తాం అంటే ఎలా అని ప్రశ్నించారు. ఏమైనా అంటే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామంటున్నారని, తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో ఇస్తారా.. అని అడిగారు. తమ పిల్లలకు చదువు, ఆసుపత్రులు, పనిచేస్తున్న ప్రాంతాలు ఇక్కడ ఉంటే ఎక్కడో ఇచ్చే డబుల్ బెడ్ రూమ్ మాకెందుకు అంటూ నిలదీశారు.



రెవెన్యూ సిబ్బందితో గొడవకు దిగిన బాధితులు




రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి

తమ ఇండ్లు కూల్చవద్దు

**సర్వే చేస్తున్న అధికారులు :**

రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల పరిధిలో విస్తరించి ఉన్న మూసీ ప్రాంతంలో 332 అక్రమ నిర్మాణాలు ఉన్నాయని గుర్తించిన అధికారులు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి నేతృత్వంలో నాలుగు బృందాలుగా విడిపోయి రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న ఇండ్లకు, మెకానిక్ షెడ్లకు ఇవి రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్నాయంటూ మార్కింగ్ వేస్తున్నారు.

**విలేజ్ మ్యాప్ ఆధారంగా రివర్ బెడ్ ప్రాంతం గుర్తింపు : రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి :**

విలేజ్ మ్యాప్ ఆధారంగా, 1998 , 2000 ల సంవత్సరాలలో వచ్చిన మూసీ వరదల ను దృష్టిలో ఉంచుకొని రివర్ బెడ్ హద్దులను గుర్తించడం జరిగిందని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ స్థలాలకు సర్వే చేస్తున్నామని, ప్రభుత్వం తర్వాత నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.




రాయల్ జ్యూస్ సెంటర్ వద్ద గుమిగూడిన యువకులు

## రాయల్ జ్యూస్ సెంటర్ వద్ద గొడవ చేసిన ఇద్దరు యువకులు అరెస్ట్

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తా సమీపంలో 209 పిల్లర్ దగ్గర ఉన్న రాయల్ జ్యూస్ సెంటర్ ప్రాంగణంలో గొడవపడి యజమాని పై దాడి చేసిన కేసులో ఇద్దరు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పీడీపీ సమీపంలోని పిల్లర్ 209 వద్ద గల రాయల్ జ్యూస్ సెంటర్ వద్ద బుధవారం రాత్రి రెండు వర్గాలు గోడపడ్డాయి. వాటిని ఆపమని చెప్పిన జ్యూస్ సెంటర్ నిర్వాహకులపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు రాయల్ జ్యూస్ సెంటర్ యజమాని పై దాడి చేసిన కేసులో ఇద్దరినీ అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## మంత్రాలు చేస్తున్నావన్నందుకు దాడి

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం) : ఇళ్ల మధ్యలో మంత్రాలు చేయడం, అతని వద్దకు ఇతర ప్రాంతాలకు చెందిన అనేకమంది వస్తుండడాన్ని ప్రశ్నించిన ఓ యువకునిపై మంత్రాలు చేస్తున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న షాబాద్ అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటనలో నవాజుద్దీన్ అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. నవాజుద్దీన్ ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడ్డ నవాజుద్దీన్



దాడికి పాల్పడిన షాబాద్



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రజక సంఘం నాయకులు

## భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి చాకిరి విముక్తి కోసం, పోరాడిన యోధురాలు చాకలి ఐలమ్మ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి చాకిరి విముక్తి కోసం, పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పు కనిక, తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీగూడ రజక సంఘం నేతలు కొనియాడారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ శివాజీ చౌక్ వద్ద లక్ష్మి గూడ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129 జయంతి వేడుకలు నిర్వహించి చాకలి ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మిగూడ రజక సంఘం మాజీ అధ్యక్షులు కృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు జంగయ్య, మాజీ సెక్రెటరీ బాలయ్య, ప్రస్తుత ఉపాధ్యక్షుడు మహేష్, సెక్రెటరీ వేణు, పాలకవర్గ సభ్యులు మల్లేష్, రమేష్,సురేష్, విష్ణు, నాని తదితరులు పాల్గొన్నారు.




కాటేదాన్ లోని తెలంగాణ ఫుడ్స్ పరిశ్రమ

## అనుమతులు లేకున్నా వెన్న తయారు చేయడానికి ప్రయత్నిస్తున్న ఓ పరిశ్రమపై పోలీసులు దాడులు

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం): వెన్న తయారు చేయడానికి కాటేదాన్ లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన ముడి సరుకును రాజేంద్రనగర్ జోన్ ఎస్ ఓ టి పోలీసులు, మైలార్ దేవ్ పల్లి పోలీసులు గురువారం సంయుక్తంగా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు . ఇన్స్ పెక్టర్ ర్ పి మహేష్ కథనం ప్రకారం... తెలంగాణ ఫుడ్స్ పేరుతో కాటేదాన్ లో పరిశ్రమను నిర్వహిస్తున్నారు. అందులో వెన్న తయారుచేస్తారు. అయితే ఆ పరిశ్రమ లైసెన్స్ ముగిసింది. ప్రస్తుతం పరిశ్రమకు లైసెన్స్ లేదు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ పరిశ్రమంలో పెద్ద ఎత్తున వెన్న తయారు చేసే ముడి సరుకులను నిలువ ఉంచారని తెలుసుకున్న పోలీసులు గురువారం దాడులు చేయగా 100 కిలోల నెయ్యి లభ్యమయింది. ప్యాకింగ్ లో ఉన్న 7,280 కేజీల వెన్న , 15, 000 కేజీ ల వెన్న తయారీ కి ఉపయోగించే ముడి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చార్మినార్ జోన్ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు దైవ నిధి, వెంకటనారాయణ ఆధ్వర్యంలో సీజ్ చేసి షాంపూల్ సేకరించి ల్యాబ్ కు పంపించారు.

## భూమికోసం భుక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలి

### కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం) పోరాడితే పోయేదేమీ లేదు అంటూ తెగువ చూపిన చాకలి అయిలమ్మ ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత, మహిళలు ముందుకు సాగాలని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా కూకట్ పల్లి మూసాపేట్ లోని రజక సంఘం అధ్యక్షులు నోముల సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర నారి ఐలమ్మ అంటూ కొనియాడారు. రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి దారి కోటి లోని మహిళా కళాశాలకు ఆమె పేరు పెట్టడం మహిళల పట్ల ఉన్న గౌరవభావాన్ని తెలియజేస్తుందన్నారు. అనంతరం అక్కడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి, కర్కే పెంటయ్య , రఘు ,పుష్ప రెడ్డి, , నయీమ్, సతీష్ గౌడ్ ,చున్ను పాషా , సుధాకర్, ప్రకాష్, జమీర్ , షకీల్ ,అరుణ్, సచిన్, శివ చౌదరి, బచ్చుమల్లి సంధ్య, జోజమ్మ, కర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద తాళ్ల గుంట వద్ద చాకలి ఐలమ్మ కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక చాకలి ఐలమ్మ అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పెద్ద తాళ్లకుంట వద్ద మన తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి (చిట్యాల) ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కొలను సుభాష్ రెడ్డి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వరరావు, బిజెపి నాయకులు మల్లారెడ్డి, స్థానిక నాయకులు జాలిగం చిత్తారి, సనివెల్లి చంద్రశేఖర్ రెడ్డి, సరికొండ వెంకటేష్, పలుగు చెరువు మహేష్, రావుల జంగయ్య, నర్సింగరావు, శంకర్ పాల్గొన్నారు.



వీరనారి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం): తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారిగా ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్ అన్నారు. మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని తాము పనిచేస్తున్న రంగాలలో ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

## కూరగాయల మార్కెట్ నిర్మాణానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే జిఎంఆర్

### ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన కూరగాయల వ్యాపారులు



కొత్తకోట, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయల వ్యాపారస్తులు కూరగాయలు విక్రయించడానికి రైతు బజారు, స్థలము లేనందున కూరగాయల వ్యాపారస్తులు గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కి మార్కెట్ ను ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ మార్కెట్ ను గ్రామపంచాయతీ ఏదైతే కూలదోసింద్రో అదే స్థలంలో మార్కెట్ను నిర్మించాలని కోరారు. మున్సిపాలిటీ చైర్మన్ సుకేసిని మీకు ఆరు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటివరకు మార్కెట్లో నిర్మించకపోవడం బాధాకరమన్నారు. మాకు ఉన్నటువంటి 12 షాపులను నేలమట్టం చేశారని వాటికి మేము అద్దె చెల్లిస్తూ ఉండేవారమని మా కూరగాయలు పెట్టుకోవడానికి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు గ్రామపంచాయతీ స్థలంలోనే మార్కెట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూరగాయల సంఘం అధ్యక్షులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా లోకానికి స్ఫూర్తి వీర వనిత ఐలమ్మ జీవితం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



పెద్ద తాళ్ల కుంట వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రాహానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, సెప్టెంబర్26(ప్రభాత ఉదయం): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక ఐలమ్మ అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్ కొనియాడారు. తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన చాకలి (చిట్యాల) ఐలమ్మ గారి 129వ జయంతి సందర్భంగా అత్తాపూర్ లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధిక కార్యక్రమం లో నాయకులు కొండమీది నర్సింగరావు, కొండమీది హరినాథ్, మ్యాడమ్ రామేశ్వరరావు, కొలన్ సుభాష్ రెడ్డి , జాలిగం చిత్తారి, ఎర్ర శంకర్, లింగం, ఎం. కొమురయ్య, ఎన్. మల్లారెడ్డి, బండారు రమేష్, పలుగుచెరువు మహేష్, సరికొండ వెంకటేష్, పుష్పమ్మ, బొక్క ప్రభాకర్ రెడ్డి, ఆదిరాల పరమేష్, లింగం తో పాటు పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



బన్సీలాల్ నగర్ చౌరస్తాలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పెండ్యాల శ్రీధర్ తదితరులు

**వ్యవసాయ వర్సిటీలో...**

వీరనారి ఐలమ్మ జయంతిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో వీరనారి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలు అర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పోరాటాన్ని, త్యాగాన్ని మననం చేసుకున్నారు. విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది కూడా వీరనారి ఐలమ్మకి ఘనంగా నివాళులు అర్పించారు.

**బన్సీలాల్ నగర్ లో.....**

తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు ,ఆత్మగౌరవ ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు రాజేంద్రనగర్ చాకలి ఐలమ్మ సంఘం సభ్యులు పెండ్యాల శ్రీధర్ ,పెండ్యాల సాయి మల్లిక్ ప్రకటించారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి వారి కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని సందర్భంగా గురువారం రాజేంద్ర నగర్ బుద్వేల్ ఫిల్టర్ బెడ్స్ బన్సీలాల్ నగర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సామాజిక సంస్కృతిగా అస్తిత్వ ఉద్యమంలో స్వయం పాలన కోసం కొనసాగిన పోరాటంలో బహుజనులు భాగస్వామ్యం కావడం వెనుక ఆమె త్యాగం ఇమిడి ఉందన్నారు . ఈ కార్యక్రమం లో హైదరాబాద్ జనరల్ సెక్రటరీ పెండ్యాల శ్రీధర్,పెండ్యాల సాయి మల్లిక్ , జ్ఞానేశ్వర్ శ్రీను,యాదగిరి,రవి, అరుణ్, భాస్కర్ వికాస్, బాబు , వెంకటేష్, గోపి, విక్కీ, మహేందర్ శివ పాల్గొన్నారు



వీరనారి ఐలమ్మ చిత్ర పటానికి నమస్కరిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామిరెడ్డి

# పక్క రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చే ఎత్తిపోతల పథకం
# గట్టు, కేటీ దొడ్డి మండలాలను ముంచడమే

**భూములు మనవి సాగునీరు వారికా?**
**కమిషన్ల కక్కుర్తి కోసం పక్క రాష్ట్రాల నాయకుల మెప్పు కోసం మరో కుట్రకు తెరలేపిన గద్వాల నాయకత్వం**

గద్వాల(కేటిదొడ్డి), సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం)పక్క రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చేందుకు సోమనాద్రి గట్టుఎత్తిపోతల రిజర్వాయ సామర్థ్యం పెంచుతున్నారని, గట్టు, కేటీ దొడ్డి మండలాలను ముంచడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ ఆరోపించారు. బుధవారం రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఎక్సైజ్ శాం మంత్రి జూపల్లి కృష్ణారావు గట్టు ఎత్తిపోతల పథకాన్ని సందర్శించి, రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి పక్క రాష్ట్రానికి లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించాలనే ప్రతిపాదనతో పర్యటించిన నేపథ్యంలో గురువారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు గట్టు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ... గట్టు ఎత్తిపోతల పథకం కొన్ని దశాబ్దాల కల దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం గట్టు మండలానికి సాగునీరు అందక వలసలు వెళుతూ అక్షరాస్యత పరంగా అత్యంత వెనుకబాడుతనానికి గురైన ప్రాంతమని అన్నారు. పేదరికం నుంచి గట్టెక్కలన్నా, వలసలు ఆగాలన్న గట్టు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు కోరుతున్నా, అనేకమంది ముఖ్యమంత్రులు మారిన ఇప్పటికీ కార్యరూపం దాల్చకుండగా పాలకులు మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నటువంటి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన అది నీటి మూటగానే మారిందన్నారు. గత ప్రభుత్వం లో ఉన్న నాయకులే ప్రస్తుత ప్రభుత్వంలో ఉండి గట్టు ప్రస్తుత గట్టు ఎత్తిపోతల పథకాన్ని ఆనాడు పూర్తి చేయకుండా,ఇప్పుడు మరో కొత్త నాటకానికి తెరదీశారని విమర్శించారు. 1.5 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాల్సిన గట్టు రిజర్వాయర్ ను 15 టీఎంసిలకు పైగా సామర్థ్యాన్ని పెంచాలని ఇక్కడ 33000 ఎకరాలకు సాగునీరు అందించి పక్క రాష్ట్రంలో కర్ణాటకలోని రాయచూర్ లో లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందించాలనే ప్రతిపాదన వెనుక వున్న మీ వ్యూహం ఏమిటి అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రం నాయకుల మెప్పు కోసమా? కమిషన్ల కక్కుర్తి కోసమా? అని ప్రశ్నించారు. గతంలో పాలకులు కూడా ఆనాటి రాయలసీమ నాయకుల మెప్పుకోసం అవసరము లేని రిజర్వాయర్లు నిర్మించారని,



నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా రెండు లక్షలకు సాగునీరు అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు ఇప్పటికీ పూర్తిస్థాయి సామర్థ్యంలో సాగునీరు ఎందుకు అందించడం లేదో? డిస్ట్రిబ్యూటరీ కాలువలను ఎందుకు పూర్తిస్థాయిలో నిర్మించలేదో? సమాధానం చెప్పాలని అన్నారు. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే ఆర్డీఎస్ ద్వారా మనకు రావాల్సిన మన వాటాను తీసుకొని అక్కడి నుండి వారి వాట ప్రకారం కర్ణాటక కు తక్కువ ఖర్చుతో సాగునీరు అందించొచ్చని అలా కాకుండా మన భూములు కోల్పోయి మన నిర్వహణతో, మన ఖర్చుతో పక్క రాష్ట్రానికి సాగునీరు అందించడం దేనికని ప్రశ్నించారు. మీరనుకున్నటువంటి 15 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తే జూరాల ప్రాజెక్టు కంటే ఎక్కువ భూములు, గ్రామాలు కోల్పోయి తక్కువ భూములకు సాగునీరు అందించడం వల్ల చారానా మురిగికి బారాన మసాలాలి అన్న చందంగా తయారవుతుందని అన్నారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచన చేయకుంటే నడిగడ్డ హక్కుల పోరాట సమితి వ్యతిరేకించడమే గాక గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్తుందని, ప్రస్తుతం ఉన్నటువంటి గట్టు రిజర్వాయర్ ని పూర్తి చేసి గట్టు మరియు కేటి దొడ్డి ప్రజలకు సాగునీరు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చి బాబు నాయకులు శ్రీనివాస్ యాదవ్, రంగ స్వామి, విష్ణు గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, వెంకట్రాములు,కేటి దొడ్డి మండల నాయకులు విజయ్, గజేంద్ర, నరసింహా, జమ్మన్న రఘుపతి,వీరన్న, సామేలు ఆంజనే యులు, మహమ్మద్ పాషా,రామాంజనేయులు అడవి ఆంజనేయులు మల్దకల్ పాల్గొన్నారు



# మహిళ లోకానికి స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ

**ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

కొత్తకోట, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) తెలంగాణ మహిళ లోకానికే స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వీరవనిత చాకలి ఐలమ్మ 129 వ, జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని, ఐలమ్మ పోరాట స్ఫూర్తినే తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు, భూమి, భుక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటమే.మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తిగా నిలిచి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంచిందని తెలిపారు, ఎవరు కోరకుండానే ఐలమ్మ పోరాట పటిమ గుర్తించి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా యూనివర్సిటీ ఐలమ్మ పేరు పెట్టారని, ప్రభుత్వంలో కుటుంబాన్ని భాగ్యస్వామ్యం చేసేందుకు వారి మనమరాలిని మహిళా కమిషన్ సభ్యురాలుగా నియమించిందని చెప్పారు, కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఇద్దరు రజక సోదరులు గతంలో బసవరాజు,సారయ్య, ప్రస్తుతం వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారని తెలిపారు, రజకులను ఎస్సీ లో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు, అదేవిధంగా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో రజక కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుండి తక్షణమే ఐదు లక్షలు రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మాజీ జెడ్పిటిసి డాక్టర్ పి జె బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు బోయెజ్,కృష్ణారెడ్డి, బీచు పల్లి, మేస్త్రి శ్రీను, వేముల శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రజక సంఘం అధ్యక్షులు బాలస్వామి, గౌరవ అధ్యక్షులు లక్ష్మయ్య, సలీం ఖాన్,ఎండి లతీఫ్, సుభాష్,సుజ్ఞానం, నవీన్, సంద వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎమ్మెల్యే జిఎంఆర్

# క్రీడలకు 350 కోట్ల కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి: ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర (అడ్డాకుల), సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 14%ఒ%17 గేమ్స్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు తోపాటు క్రీడాలపై దృష్టి సారించాలని, గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని కోరారు, నవంబర్ లో గ్రామీణ స్థాయిలో విద్యార్థులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ పేరిట రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు 350 కోట్ల రూపాయలు కేటాయించారని తెలిపారు, అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో అండర్ 14, అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించబోతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ తెలియజేశారు.



# పారిశుధ్య, మల్టీపర్పస్ కార్మికులకు దుస్తులు, పారిశుధ్య కిట్ల పంపిణీ

కొత్తకోట, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ వద్ద నిర్వహించిన హెల్త్ క్యాంప్ , శానిటేషన్ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు దుస్తులు , పారిశుధ్య కిట్ల పంపిణీ చేశారు . ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు దుస్తులు, కిట్లను అందజేశారు.

# వనపర్తి జిల్లాలో రెండు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు ఏర్పాటు: జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, నియమ నిబంధనల మేరకు వనపర్తి జిల్లాలో రెండు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నెలకొల్పనున్నన్నట్లు జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలక్టర్ అధ్యక్షతన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కమిటీ సమావేశమై జిల్లాలో ఎన్ని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ లు ఏర్పాటు చేయాలి, వాటిలో ఏ ఏ ప్రాంతాలను కలపాలి అనే అంశాలపై కమిటీలో చర్చించారు. వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు కలిపి ఒక అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, ఆత్మకూరు, అమర్చింత కలిపి రెండో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలుగా ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మున్సిపల్ ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల ఉన్న రెవెన్యూ గ్రామాలు, లే అవుట్ లు ఎక్కువగా ఏర్పడి అభివృద్ధి చెందనున్న రెవెన్యూ గ్రామాలను అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ లో కలపనున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ లు ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డి.పి. ఒ సురేష్, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారి, డి.ఎల్.పి. ఒ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ వెంకటరమణ ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

# తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ కోశాధికారిని ఘనంగా సన్మానించిన మాజీ ఎంపీపీ, వైశ్య జిల్లా నాయకులు

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఆవరణలో వనపర్తి జిల్లా ఆర్యవైశ్య నాయకులు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ ట్రెజరర్గా నియమితులైన విశ్వనాథ వెంకటరమణని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కల్వ రాజు, మాజీ ఎంపీపీ వనపర్తి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ అధ్యక్షులు గుంత మౌనిక మల్లేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి దాచా లక్ష్మీనారాయణ, కోశాధికారి విజయకుమార్, వనపర్తి జిల్లా లోని వివిధ మండలాల నాయకులు, పట్టణాల నాయకులు ,పెద్దలు, యువకులు, పాల్గొన్నారు.




# కూకట్పల్లిలో ఎన్ని చెరువులు కబ్జా అయ్యాయో లెక్కలు తీద్దామా కెటిఆర్

**పదేళ్లలో ఇచ్చిన అనుమతులు.. అక్రమ నిర్మాణాలపై కేటీఆర్ నీ ప్రాసిక్యూట్ చేయాలి**
**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

కూకట్పల్లి, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం) మాజీ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గంలో పర్యటిస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు డా. సత్యం శ్రీరంగం, శ్రీకాంత్ యాదవ్, లింగం యాదవ్, వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని బాగు చేయండి, హైడ్రా పేరుతో భయపెట్టొద్దు, అక్రమ కట్టడాల పేరుతో సామాన్యుల్ని భయపెడుతున్నారని, అయ్యప్ప సొసైటీ లో ముఖ్యమంత్రి సోదరులు అరాచకం సృష్టిస్తున్నారని కేటీఆర్ పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారని, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు 2014 లో జేసీబీలు పెట్టి అయ్యప్ప సొసైటీ కూల్చేస్తాం అని నాటకాలాడి ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. గతంలో నాళాల పై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని చెప్పింది మీ నాన్న కెసిఆర్, మీరు అధికారంలో ఉన్న పదేళ్లలో 28 వేలు కాస్త 58 వేల అక్రమ కట్టడాలయ్యాయని అన్నారు. కూకట్ పల్లికి వచ్చావు కేటీఆర్ నీ పక్కనే కబ్జా కోరు అయిన మీ పార్టీ స్థానిక ఎమ్మెల్యేని కూర్చోపెట్టుకుని అక్రమ నిర్మాణాలు గురించి, కబ్జాల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కూకట్ పల్లి లో గత పదేళ్లలో ఎన్ని చెరువులు కబ్జాలు అయ్యాయో అని లెక్క తిద్దామని అన్నారు. కేటీఆర్ మీరు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నపుడు మీరు కూకట్ పల్లి వచ్చారు, చెరువుల అక్రమ కట్టడాలకు అనుమతులు ఎవరిచ్చారు మీరు కాదా అని ప్రశ్నించారు.

# ఉరి వేసుకొని ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని కేవీల్ ఐ క్యాంప్ లో గల ఇరిగేషన్ కార్యాలయంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పాడాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిప వివరాల ప్రకారం గద్వాల కు చెందిన అశోక్ కుమార్ (41) పెబ్బేర్ పీజేపీ కార్యాలయం ఇఇ డివిజన్ -1 లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల గద్వాల పీజేపీ కార్యాలయంలో పని చేస్తున్న ఆయన పదోన్నతి పై పెబ్బేర్ డివిజన్ పీజేపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గురువారం ఉదయం గద్వాల పీజేపీ కార్యాలయ గది తెరవడానికి వచ్చిన అటెండర్ కు అశోక్కుమార్ ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనబడటంతో సంబంధిత అధికారులకు తెలియజేశాడు. కుటుంబ సభ్యులు, గద్వాల టౌన్ పోలీసులు, ఇరిగేషన్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాని పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నాడు. కాగ అశోక్ కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



# సీఎం రిలీఫ్ అండ్ పేదలకు వైద్యానికి వరం లాంటిది: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీలో 14 వ వార్డుకు చెందిన జె పద్మమ్మ కు 2 లక్షల 50వేల రూపాయల లెటర్ ను దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది అన్నారు.ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ,రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లె పల్లెపాగ ప్రశాంత్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు ,ఎన్ జె బోయజ్, పి కృష్ణారెడ్డి,కోన రాజశేఖర్, కొత్తకోట పట్టణ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు , సంద వెంకటేష్, సంజీవులు యాదవ్, గుంత రమణ, ముజీబ్, రామ్ లాల్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అధికారులు

# మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సంక్షేమ శాఖ అధికారులు

కొత్త కోట, సెప్టెంబర్ 26(ప్రభాత ఉదయం)వనపర్తి జంగిడిపురం ప్రభుత్వ ఎస్ సి బాలుర వసతి గ్రహంలో పనిచేస్తున్న వర్కర్ మహమ్మద్ భార్యకు సంక్షేమ శాఖ అధికారులు ఆర్థిక సహాయం అందచేశారు. అవుట్ సోర్సింగ్ వర్కర్ మహమూద్ గుండె పోటుతో మరణించారు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి ఏ నూషిత సూచన మేరకు కొత్తకోట ఏఎస్ సి డి సి వసతి గృహ సంక్షేమ అధికారులు అవుట్ సోర్సింగ్ సిబ్బంది కుటుంబ సభ్యులను కలిసి 45 వేల సహాయ సంక్షేమ శాఖ అధికారి జే . మల్లేశం అందజేశారు. ఈ కార్యక్రమం లో వసతి గృహ సంక్షేమ అధికారులు జే.బెనర్జీ, జీసీ రాజు, ఆనంద్ జి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ, సుజాత, విద్యావతి,, జ్యోతి , అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇళ్ల దరఖాస్తులో అలసత్వం వద్దు

**కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్ కోటగడ్డ**

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26 (ప్రభాత ఉదయం) సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు సొంత ఇంటి స్థలాల కోసం చేసిన ప్రయత్నాలు త్వరలోనే నెరవేరే అవకాశాలు ఉన్నాయని కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్ తెలిపారు. టి యు డబ్ల్యు జే ఐజేయు రాష్ట్ర నాయకత్వం పలుమార్లు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి స్థానికంగా రిపోర్టర్లు సొంత ఇల్లు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల వారీగా పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు సేకరించాల్సిందిగా యూనియన్ నాయకులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( ఐజేయు ) ఆధ్వర్యంలో సీనియార్టీ ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టు ఆదివారం సాయంత్రం లోగా సూరారం ప్రెస్ క్లబ్ వద్ద తమ తమ దరఖాస్తులను అందజేయాల్సిందిగా కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.